ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అంకుసాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బుద్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఏడో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అంకుసాపూర్ సర్పంచ్ జలజ, ఎంపీటీసీ శోభారాణి, అధికారులు నిరుప, రాములు, నాగకల్యాణి, రామ్ లక్ష్మణ్, శేషుకుమారి, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, ధర్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ క్లీనింగ్ యంత్రం ప్రారంభం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో గల మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో అయిన చోట డ్రైనేజీ క్లీనింగ్ చేసేందుకు రూ 39.89 లతో కొనుగోలు చేసిన సెక్షన్ కమ్ జెట్టింగ్‌మెషిన్‌ను మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో అయితే 9640010053 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్‌చైర్మెన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ స భ్యులు, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలకు ప్రజలు మోసపోయారు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

కృతజ్ఞత సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

శామీర్‌పేట్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు ప్రజలు మోసపోయి, అధికారం ఇచ్చారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలిచిన సందర్భంగా అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్‌లో సోమవారం కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చిందని ప్రజలకు అర్థమైందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాలు మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తన విజయానికి కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు ఎమ్మెల్యే మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్, శామీర్‌పేట మండలాధ్యక్షుడు సుదర్శన్, మల్లేశ్, ఎంపీపీలు ఎల్లుబాయి, హారిక, జెడ్పీటీసీ అనిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్ తొలగింపు



అండర్ పాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్



హోర్డింగ్ తొలగించిన తర్వాత దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఘట్‌కేసర్: సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'భూమి సర్కారుది.. ఆదాయం ప్రైవేట్‌కు' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అనుమతి లేకుండా ఘట్‌కేసర్ అండర్ పాస్ వద్ద నిర్మించిన హోర్డింగ్‌ను తొలగించాలని ఆదేశించారు. దీంతో యాడ్ ఏజెన్సీ సిబ్బంది పూర్తిగా తొలగించారు. రోడ్డు విస్తరణ కోసం సేకరించిన భూమిలోనూ ప్రైవేట్ పెత్తనం వద్దని ప్రచురించిన సాక్షికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పశు వైద్యశాల సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని పశు వైద్యశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలోని పశువైద్యశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి అనిమల్ ఎగ్జామినేషన్ టేబుల్, షెడ్డు, వాటర్ ట్యాంక్, మేల్ అటెండర్ అవసరముందని ఆయనకు వివరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గాంధీజీకి ఘన నివాళి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరితో కలిసి పంచాయతీ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మత్స్యేందర్‌రెడ్డి, సాయిలు, వెంకటేశ్, ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

మేడ్చల్: మేడ్చల్ ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్ కార్యాలయ సమీపంలోని గాంధీజీ విగ్రహాలకు అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వివిధ గ్రామాల్లనూ కార్యక్రమాలు నిర్వహించారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు మహాత్మ గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ రాములు కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, హేమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, గ్రామాల్లో సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



గుండ్లపోచంపల్లిలో గాంధీజీ వర్ధంతిలో పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది



మూడుచింతలపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వచ్చే నెల 2 నుంచే 'ప్రత్యేక' పాలన

రేపటితో ముగియనున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం

- నగర శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 619 పంచాయతీలు
- స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి అధికారుల ప్రతిపాదనలు
- ఆమోదించిన ప్రభుత్వం



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం రేపటితో ముగియనుండడంతో వచ్చే నెల 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ మేరకు ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లతో సహా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ అధికారుల నియామకానికి ప్రతిపాదనలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం సంబంధిత జాబితాను ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వాటికి ఆమోద ముద్ర పడడంతో నిర్దేశించిన గ్రామ పంచాయతీలకు వీరు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించి ఫిబ్రవరి 2 నుంచి విధులు నిర్వర్తించనున్నారు.

నగర శివారుల్లో 619 పంచాయతీలు

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 జీపీలు, రంగారెడ్డి జిల్లాలో 558 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్‌తో సహా పాలక వర్గం పదవీ కాలం రేపటి (ఫిబ్రవరి1)తో ముగియనుండడంతో వారి స్థానంలో స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన అధికారులు గ్రామాల్లో ప్రజల బాగోగులను పర్యవేక్షించడంతో పాటు వారికి అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్య పనులు, హరితహారం, వీధిలైట్లు, పల్లె ప్రకృతి వనాలు, డంప్ యార్డులు, వైకుంఠధామాల నిర్వహణతో పాటు వివిధ రకాల పన్నుల వసూళ్లు, నూతన భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తదితర వాటిపై పర్యవేక్షణ చేయనున్నారు.

మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా లతారెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్‌కు చెందిన లతారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని, అలాగే మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు



ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన కీసర రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

కీసర: కీసరగుట్టలో నిర్మిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి తనవంతూ సహాయం అందించనున్నట్లు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు గుర్రం మల్లారెడ్డి, నల్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసి కీసరగుట్టలో నిర్మిస్తున్న రెడ్డి భవన పనులపై చర్చించారు.

వాలీబాల్ క్రీడాకారుడికి అభినందనలు



నిఖిల్‌ను అభినందిస్తున్న జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టుకు మర్పల్లిగూడకు చెందిన నిఖిల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆయనను మంగళవారం పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, సత్యనారాయణరెడ్డి, బస్వరాజ్‌గౌడ్, కృష్ణగౌడ్, నరేశ్, శివనాయక్, అనిల్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, దినేశ్, శంకర్ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థులకు పలు సంస్థలు ఆర్థికసాయం చేసి అండగా నిలిచాయి. మనోహర్ ట్రస్ట్, అమెజాన్ ఎంప్లాయిస్ గ్రాంట్ సహకారంతో ఇద్దరికి రూ.70 వేల ఆర్థిక సాయం అందించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మనోహర్ ట్రస్ట్ అధ్యక్షుడు అనంత్‌కుమార్, అమెజాన్ ప్రతినిధి భాగ్య, కన్వీనర్ హనుమాజీ, కళాశాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

మేడ్చల్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ, సీఐ

మేడ్చల్ రూరల్: మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్ గౌడ్ ఆధ్వర్యంలో ఓఆర్‌ఆర్ సర్వీస్‌రోడ్డు వద్ద మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేకుండా కనబడకుండా స్టిక్కర్ అంటించి తిరుగుతున్న ఆరు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం వాహనదారులను మాదాపూర్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనాలను నెంబర్ ప్లేట్ లేకుండా, కనబడకుండా చేసి నడిపితే చట్టపరంగా నేరమన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వాహనాలు సీజ్ చేయడంతో పాటు యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిత

మేడ్చల్: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ రజిత రాజామల్లారెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని, దీంతో వారు బాగా అభివృద్ధి చేశారని కొనియాడారు.

మొక్కుబడిగా చర్చలు..

మండల పరిషత్ సమావేశంలో ఈ సారి చర్చలు మొక్కుబడిగా సాగాయి. ట్రాఫిక్ అధికారులు రోడ్డు నిబంధనలపై, రెవెన్యూ అధికారులు తమ శాఖ తీరుపై, వ్యవసాయ, ఉద్యానవన శాఖ వారు తమ శాఖల అభివృద్ధిని వివరించారు. సర్పంచ్‌ల సన్మానానికి ఇచ్చిన ప్రాధాన్యత సభ నిర్వహణకు ఇవ్వకపోవడంతో పెద్దగా సమస్యలు చర్చకు నోచుకోలేదు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెంకటేశం, జెడ్పీటీసీ శైలజావిజయానందరెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అమరుల సంస్మరణ దినోత్సవం



మౌనం పాటిస్తున్న అధికారులు, సిబ్బంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, నేతృత్వంలో మంగళవారం సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు సన్మానం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి ఒకటి నుంచి సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో అన్ని గ్రామాల సర్పంచ్‌లను ఎంపీపీ రజిత రాజామల్లారెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడుతూ శాలువాలు కప్పి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శైలజా విజయానందరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశం, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లారీ ఎక్కిన రైలు..



సాధారణంగా రైళ్లు పట్టాలపై పరుగెడుతుంటాయి.అయితే ఫ్యాక్టరీలో తయారైన ఓ రైల్ ఇంజిన్‌ను అధికారులు మంగళవారం లారీపై 44వ జాతీయ రహదారిపై మేడ్చల్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా వాహదారులు, ప్రజలు ఆసక్తిగా చూశారు. అంతేగాకుండా తమ కెమెరాల్లోనూ ఆ చిత్రాన్ని బంధించారు. – మేడ్చల్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సింగపూర్ టౌన్‌షిప్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్జీకే కాలనీ, ఆర్‌ఎస్‌ఆర్ హైట్స్, మయూరి డెవలపర్స్, సాయినగర్, పకీర్‌టెక్యా, ఎమరాల్డ్ హైట్స్, సూర్యనగర్, మోడీ బిల్డింగ్స్, ఎల్‌ఐజీ, ఎల్‌ఎస్ కాలనీ, అన్నోజిగూడ, సింగపూర్ ఫేజ్ 1, 2లోని అన్ని బ్లాకులు, ఆర్‌ఎన్‌ఆర్ ఎన్‌క్లేవ్, జైపురి కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఫిబ్రవరి 9న తైబజార్ వేలం

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలంను ఫిబ్రవరి 9న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని నాగారం, రాంపల్లికి సంబంధించి నిర్వహించనున్న వేలంలో పాల్గొనేవారు ఫిబ్రవరి 8న గురువారం సాయంత్రం 5 గంటల్లోగా (కమిషనర్ నాగారం మున్సిపాలిటీ) పేరు మీద రూ. 2 లక్షల డిడి తీసి నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

నూతన సీఐకి సన్మానం



సీఐని అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన గోవర్ధనగిరిని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు అలాగే ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ రాంరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణాముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ కోశాధికారి శశిధరన్, ఆంజనేయులుయాదవ్, నర్సింగ్‌రావు, మల్లేశ్ యాదవ్, ఫరూక్, రహమాన్, అష్రఫ్, శ్రీనివాస్, రాజు, సునీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



మేడ్చల్: మేడ్చల్ డిపోలో 2023 డిసెంబర్‌లో ఉత్తమ సేవలందించిన కండక్టర్లు, డ్రైవర్లకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎం సుధాకర్, అధికారులు ప్రతీనెల ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లను సన్మానించి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం రామారావు, అధికారులు స్నేహలత, సత్యనారయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు..



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ చూపారు. దీంతో మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందిచారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, నవీన్, కోచ్ సాయికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

శామీర్‌పేట్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నెరవేరుస్తామని మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్ అన్నారు. మండలకేంద్రంలో ముఖ్యనాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తి కాలేదని, బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు సబబు కాదని మండిపడ్డారు.

గాంధీకి ఘన నివాళి..

మూడుచింతలపల్లిలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యానాథ్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, వెంకటేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలి

కీసర: మండలకేంద్రంలో అంబేడ్కర్ భవనం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, సెక్రటరీ తుడుం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ సంఘం నేతలు మల్లేశ్, ప్రవీణ్ కుమార్, శీలం శ్రీనివాస్, భూపాల్, మలేలేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ఘట్‌కేసర్: జడ్పీ కొర్రెముల్ పాఠశాల , చౌదరిగూడ మండల పరిషత్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీలు భాస్కర్ రెడ్డి, రామారావు ముదిరాజ్, ఎంపీడీఓ అరుణారెడ్డి, ఏఈ వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు భోజిరెడ్డి, స్వామిదాస్, సుధాకర్, లక్ష్మణ్‌గౌడ్, నాయకుడు శేఖర్‌రెడ్డి, జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేటి కృతజ్ఞత సభకు తరలిరండి

కీసర: శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తాలో గల సీఎంఆర్ కన్వేన్స్‌లో మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో నేడు కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు కీసర మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కీసర మండలంలోని బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

ఈఓ విధులకు ఆటంకపరచిన రౌడీషీటర్‌పై కేసు

ఘట్‌కేసర్: మైసమ్మగుట్ట ఈఓ విధులకు ఆటంకపరచిన రౌడీషీటర్‌పై ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 28న జరిగిన గట్టుమైసమ్మ జాతరలో మహిళా అధికారి, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి విధులకు స్థానిక రౌడీషీటర్ బండమీది యాదగిరియాదవ్ ఆటంకం కలిగించాడు. అలాగే అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా దాడికి యత్నించాడని పీఎస్‌లో ఈఓ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.